సాక్షి పెద్దపల్లి

శనివారం । 13 । మే । 2023



గోల్‌సెట్టింగ్‌పై అవగాహన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఇంపాక్ట్ ట్రెయినర్ ఆకుల రమేశ్ గోల్‌సెట్టింగ్‌పై అవగాహన కల్పించారు.



సైబర్ సెక్యూరిటీపై శిక్షణ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఈవో ఎన్.కె మెహత డాటా భద్రతపై అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
42.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నర్సుల సేవలు మరువలేనివి



నర్సింగ్ సిబ్బందికి మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ(రామగుండం): నర్సుల సేవలు, త్యాగం మరువలేనివి అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన నర్సింగ్ డే వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేకును కట్ చేసిన ఎమ్మెల్యే, నర్సింగ్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ నర్సులు సహనంతో రోగులను తల్లిలా చూసుకుంటున్నారని అభినందించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ పాల్గొన్నారు.

సత్కరించిన మక్కాన్‌సింగ్ ఠాకూర్

రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని నర్సింగ్ సిబ్బందిని డీసీసీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సన్మానించారు.

హిందువుల ఐక్యత చాటాలి



జూలపల్లి(పెద్దపల్లి): హిందువుల ఐక్యతను చాటేందుకు ఈనెల 14న కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించే హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ కోరారు. జూలపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ మాట్లాడుతూ అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. దాడి సంతోష్, కొప్పుల మహేశ్, డైరెక్టర్ గుమ్మడి శంకరయ్య, భీమవరపు సంపత్, చిలుక తిరుపతి, పొన్నం వెంకటేశ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయం దక్కేదెప్పుడో ?

- ఆర్‌ఎఫ్‌సీఎల్ కథ కంచికి చేరేదెప్పుడో ?
- డబ్బు చెల్లించడంలో దళారుల అలసత్వం
- కొనసాగుతున్న బాధితుల ఆత్మహత్యాయత్నాలు



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రధాన గేటు

సాక్షి, పెద్దపల్లి: రామగుండంలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరించడంతో పలువురు నిరుద్యోగులు ఉద్యోగాలు వస్తాయని ఆశపడ్డారు. స్థానికంగా ఉంటూనే ఉద్యోగం చేసుకోవచ్చని.. పీఎఫ్.. ఉచిత క్వాటర్ వంటి సౌకర్యాలు పొందవచ్చని అనుకున్నారు. నిరుద్యోగుల ఆసరాను అవకాశంగా తీసుకున్న కొందరు దళారులు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.2లక్షల నుంచి రూ.12 లక్షల వరకు దండుకున్నారు. ఉద్యోగం వస్తుందనే ఆశలో కొందరు పొలం, భూములు అమ్మితే.. మరికొందరు అప్పులు చేసి డబ్బులను దళారుల చేతుల్లో పోశారు. అయితే పర్మినెంట్ ఉద్యోగం కాకపోవడం.. ఏడాది తిరగక ముందే ఉద్యోగాలు పోవడంతో బాధితులు రోడ్డెక్కారు. న్యాయం చేయాలంటూ ధర్నాలు.. రాస్తారోకోలకు దిగారు. కొందరు ప్రాణాలు తీసుకోగా.. మరికొందరు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడ్డారు.

నిరసనల హోరు..

న్యాయం చేయాలంటూ ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులు రోజుల కొద్దీ దీక్షలు, ధర్నాలు చేపట్టారు. చలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష కమిటీ చేతులు ఎత్తివేయడం, మావోల బెదిరింపు లేఖలు వచ్చాయి. బాధితులు ఎన్ని రూపాల్లో పోరాటాలు చేసినా నేటికీ ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులు తమకు రావాల్సిన డబ్బుల కోసం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

వసూలు చేసింది రూ.20కోట్లు.. ఇచ్చింది రూ.9కోట్లే

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 450 మంది కార్మికులు అవసరం ఉండగా.. 790 మందిని డ్యూటీలోకి తీసుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.12 లక్షల చొప్పున సుమారు రూ.20 కోట్ల మేర వసూళ్లకు పాల్పడినట్లు గతంలో అఖిలపక్ష కమిటీ నిర్ధారించింది. ఈ దందాలో ప్రధానంగా ఇద్దరు సబ్‌కాంట్రాక్టర్లు ఉండగా, వారి కింద 76 మంది వసూల్ రాజాలు ఉన్నట్లు గుర్తించారు. వసూలు చేసిన సొమ్ము మొత్తం కార్మికులకు తిరిగి చెల్లించాల్సిందేనని అఖిలపక్ష కమిటీ పట్టు పట్టినప్పటికీ, అందులో రూ.7 కోట్లు ఖర్చు అయ్యాయని సబ్‌కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు. బాధితులు ఇచ్చిన డబ్బుల్లో కనీసం 60 శాతం మేర చెల్లించాలని అఖిలపక్ష కమిటీ కోరింది. క్షేత్రస్థాయిలో బాధితులు ఇచ్చిన వాటిలో 30 నుంచి 45 శాతం మేర.. అది కూడా కొద్దిమందికే తిరిగిచ్చారు. దళారులు ఇచ్చే డబ్బులు తెచ్చిన అప్పుల వడ్డీకే సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరగనప్పుడు తాముండి చేసేదేముందని అఖిలపక్ష కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే మౌనంగా ఉండటం, ఎవరికి తమ గోడు చెప్పుకోవాలో తెలియకే ఈ ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని బాధితుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైన బాధితులకు న్యాయం దక్కేలా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఆగని ఆత్మహత్యాయత్నాలు

తమకు న్యాయం దక్కే పరిస్థితులు కనిపించకపోవడంతోనే ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలంటూ ముంజా హరీశ్ ఆత్మహత్య చేసుకోగా, అప్పుల బాధలు భరించలేక ఇప్పటి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడ్డారు. తాజాగా అంతర్గాం మండలానికి చెందిన తోట శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం చేయడంతో మరోసారి ఆర్‌ఎఫ్‌సీఎల్ అంశం చర్చానీయాంశంగా మారింది.

కమీషన్లు ఇస్తేనే డబ్బులు



కమీషన్లు ఇస్తేనే కొందరు నాయకులు డబ్బులు చెల్లించారు. మరికొందరు బాధితులకు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించనే లేదు. అప్పులు చేసి డబ్బులను దళారుల చేతిలో పెట్టారు. అప్పులకు వడ్డీ చెల్లించకలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 30 నుంచి 40 శాతం వరకే తిరిగిస్తున్నారు. ఇప్పటికైనా బాధితులకు మొత్తం నగదు చెల్లించాలి. బాధితులకు న్యాయం జరుగకపోతే ప్లాంట్ ముందు ధర్నాకు దిగుతాం. – అంబటి నరేశ్, ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు

అధికార పార్టీ నాయకుల అండతోనే..



రామగుండం ఫర్టిలైజర్ కెమికల్ ఫ్యాక్టరీలో ఉద్యోగాల పేరుతో మోసం చేసిన దళారులు అధికార పార్టీకి చెందిన నాయకులు. దీంతో బాధితులకు అన్యాయం జరిగింది. నగదు చెల్లింపుల్లో జాప్యం జరగడంతో బాధితులు ఆత్మహత్యలకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి.

– పిడుగు కృష్ణ, బీజేపీ నాయకుడు

ఆత్మహత్యాయత్నం బాధ్యత అధికార పార్టీదే..



పరామర్శిస్తున్న ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని(రామగుండం): ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుల ఆత్మహత్యాయత్నానికి అధికార పార్టీదే బాధ్యత అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముర్మూర్‌కు చెందిన తోట శ్రీనివాస్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.8లక్షల వరకు తీసుకుని ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. ఆర్థిక మోసానికి గురైన కార్మికులలో ఇప్పటి వరకు పది మంది వరకు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడ్డారన్నారు. నవ నిర్మాణ సభలో ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులకు అండగా ఉంటానన్న కేటీఆర్ సమాధానం చెప్పాలని కోరారు.

విద్యార్థిని కుటుంబానికి పరామర్శ

ఆత్మహత్య చేసుకున్న మద్దిర్యాలకు చెందిన విద్యార్థిని మాధవి కుటుంబాన్ని ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని సందర్శించారు. మృతురాలి తండ్రి మల్క సుధాకర్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.

15లోగా యూడైస్‌లో నమోదు చేయండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్ యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని డీఈవో మాధవి కోరారు. ఇప్పటి వరకు ఈ వివరాలన్నీ తెలంగాణ పోర్టల్‌లో ఉండేవని ఇక నుంచి యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్, టీసీ, స్కాలర్‌షిప్ వంటి వివరాలకు యూడైస్ ప్లస్‌ని ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ పోర్టల్ ద్వారా ఈ వివరాలను యూడైస్ ప్లస్‌లోకి మార్చిన తర్వాత విద్యార్థుల పుట్టిన తేదీ, ఆధార్ నంబరు, మొబైల్‌నంబరు వివరాలలో తప్పులు దొర్లాయని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థుల వివరాలను ఈనెల 15లోగా అప్‌డేట్ చేయాలని సూచించారు.

దక్షిణ పశ్చిమాలను కలిపేలా!

- కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్‌కు కేంద్రం సుముఖం
- ఎఫ్‌ఎల్‌ఎస్ సర్వేకు రూ.1.54 కోట్లు విడుదల
- 62 కిలోమీటర్ల లైన్‌తో పాత వరంగల్– కరీంనగర్‌కు ప్రయోజనం
- మహారాష్ట్ర, గుజరాత్‌కు నేరుగా ప్రయాణించే వీలు
- సికింద్రాబాద్‌కు త్వరగా చేరుకునే అవకాశం
- తగ్గనున్న 200 కిలోమీటర్ల ప్రయాణదూరం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త మోసుకొచ్చింది. చాలాకాలంగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న కరీంనగర్–హసన్‌పర్తి రైల్వేలైన్ సర్వేకు కేంద్ర రైల్వే బోర్డు ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.1.54 కోట్లు కూడా విడుదల చేసింది. దీంతో ఆగిపోయిందనుకున్న ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కనుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే కనెక్టివిటీ పరంగా మిగిలిన జిల్లాలతో పోలిస్తే వెనకబడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఈ ప్రాజెక్టు అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్ 21న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ప్రాజెక్టును పట్టాలెక్కించాలని కోరిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర రైల్వేబోర్డు సర్వేకు ఆమోదం తెలుపుతూ మే 8వ తేదీన ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

ప్రధాని పీవీ హయాంలో కదలిక

వాస్తవానికి కరీంనగర్– ఖాజీపేట రైల్వేలైన్ ఇప్పటిది కాదు. 1976లోనే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. కానీ, సర్వే, అంచనా వ్యయం తదితర విషయాల్లో ఎలాంటి పురోగతి నమోదు కాలేదు. ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు స్వీకరించాక 1994లో ఈ ప్రాజెక్టు తిరిగి తెరమీదకు వచ్చింది. గతంలో ఈ ప్రాజెక్టును కరీంనగర్–ఖాజీపేటగా పిలిచేవారు.



కేంద్ర మంత్రితో సమావేశమైన ఎంపీ బండి సంజయ్(ఫైల్)

వాస్తవానికి కరీంనగర్‌కు భౌగోళికంగా దారితీసే హసన్‌పర్తి రోడ్ స్టేషన్ నుంచి హుజూరాబాద్ మీదుగా మానకొండూరు తరువాత కరీంనగర్– పెద్దపల్లి రైల్వేలైన్ మీదుగా కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు చేరాలి. కరీంనగర్–హసనపర్తిల మధ్య రైల్వేలైన్ దూరం 45 కి.మీ మాత్రమే అని గతంలో అధికారులు తెలిపారు. తాజాగా ఈ కేంద్రం జారీ చేసిన ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్)లో మాత్రం దీని దూరాన్ని 61.8 కిమీగా పేర్కొనడం విశేషం.

కనెక్టివిటీ ఇలా..

- కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే.. పాత వరంగల్– కరీంనగర్ జిల్లాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. ముఖ్యంగా దక్షిణ– పశ్చిమ భారతదేశానికి ఈ రైల్వేలైన్ ఒక సంధానసేతువుగా నిలుస్తుంది. ప్రస్తుతం మహారాష్ట్ర వెళ్తున్న కరీంనగర్, వరంగల్ ప్రజలకు దాదాపు 200 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన ప్రయాణభారం తప్పుతుంది.
- ఈ ప్రాజెక్టు పూర్తయితే కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల ప్రజలు మహారాష్ట్రలోని ముంబై, గుజరాత్‌లోని అహ్మదాబాద్ వంటి ఇతర నగరాలకు ప్రయాణించే అవకాశం ఉంటుంది. మహారాష్ట్రలోని షిరిడీ, ఔరంగాబాద్, గుజరాత్‌లోని పలు పుణ్యక్షేత్రాలను కలిపేలైన్ కావడంతో పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడుతుంది.
- ఇప్పటికీ వరంగల్ నుంచి నిజామాబాద్ రైలు ప్రయాణం సాకారం కాలేదు. కానీ, నిజామాబాద్–కరీంనగర్–పెద్దపల్లి రైల్వేలైన్ పూర్తి కావడంతో కరీంనగర్ వరకు రైల్వేలైన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో ఇప్పుడు కేవలం హసన్‌పర్తి నుంచి కరీంనగర్ వరకు లైన్ వేస్తే నిజామాబాద్–వరంగల్ మధ్య ప్రయాణం సాకారమవుతుంది.
- ఇక వరంగల్–కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజలు ముంబై వెళ్లాలంటే ప్రస్తుతం మహరాష్ట్రలోని చంద్రాపూర్ మీదుగా దాదాపు 200 కి.మీ దూరం తిరిగి వెళ్లాలి. ఈ లైన్ పూర్తయితే.. ఆ ప్రయాణభారం తగ్గుతుంది.
- ప్రస్తుతం కరీంనగర్ ప్రజలు హైదరాబాద్ వెళ్లాలంటే కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ పూర్తయితే నేరుగా ఖాజీపేటకు లైన్ అందుబాటులోకి వస్తుంది. దీంతో కరీంనగర్ వాసులకు సికింద్రాబాద్‌కు వేగంగా రైల్లో ప్రయాణం చేసే వీలు దక్కుతుంది.

కేంద్రమంత్రికి కృతజ్ఞతలు

కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి 2013లోనే సర్వే చేసినప్పటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ అలసత్వంతో రైల్వేలైన్ నిర్మాణంలో పురోగతి లేకుండా పోయింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లోని ఐటం నంబర్–11 ప్రకారం కరీంనగర్–హసన్‌పర్తి రైల్వేలైన్ నిర్మాణం చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం కూడా అంగీకరించింది. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనం.

– ఎంపీ బండి సంజయ్

గతంలో ప్రతిపాదన రద్దు

వాస్తవానికి 2013 వరకు ఈ ప్రాజెక్టు అడపాదడపా తెరమీదకు రావడం ఆ తరువాత కనుమరుగవడం పరిపాటుగా మారింది. ఈ క్రమంలోనే కరీంనగర్–ఖాజీపేట రైల్వేలైన్ సర్వే జరిగింది. అప్పట్లో దాదాపు రూ.1.20 కోట్లు వెచ్చించి సర్వే చేసిన అధికారులు దాదాపు రూ.800 కోట్ల ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును చేపట్టడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఈ ప్రాజెక్టు రద్దు అప్పట్లో కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మాటల మంటలు పెట్టింది కూడా. తాజాగా రైల్వే బోర్డు మరోసారి సర్వే చేసేందుకు ముందుకు రావడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూతురిని చంపిన తండ్రి అరెస్టు

మంథని: మంథని మండలం భట్టుపల్లిలో గురువారం కన్న కూతురు గుండ్ల రజితను గొడ్డలితో నరికి చంపిన గుండ్ల సదయ్యను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సతీశ్ తెలిపారు. శుక్రవారం నిందితుడి అరెస్టును చూపించారు. వివరాలు సీఐ సతీశ్ కథనం ప్రకారం. గుండ్ల సదయ్య భార్య శ్రీలత 2022 సెప్టెంబర్ 4న కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి సదయ్య తన పిల్లలు అంజి, రజితతో కలిసి ఇంట్లోనే ఖాళీగా ఉంటున్నాడు. కుమారుడు అంజి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేయగా వచ్చే డబ్బులతో తాగుడుకు అలవాటు పడ్డాడు. ఈక్రమంలో తండ్రికి కుమారుడు, కూతురితో మనస్పర్థలు రావడంతో సదయ్య అప్పుడప్పుడు వాళ్లను బెదిరించేవాడు. డబ్బులు అడిగితే కుమారుడు ఇవ్వడం లేదని మనసులో పెట్టుకొని అతను బయటకెళ్లిన సమయంలో కూతురు రజితను గొడ్డలితో నరికాడు. అప్పుడే వచ్చిన కొడుకు అది చూసి భయంతో పరుగులు తీశాడు. అదే గొడ్డలితో సదయ్య గ్రామానికి చెందిన వ్యాపారి దూపం శ్రీనివాస్‌పై దాడి చేశాడు. ఇరువురి ఫిర్యాదుతో నిందితుడిని ఇంటి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. గతంలో భట్టుపల్లికి చెందిన రెడ్డి రాజేశ్‌పై దాడి చేసిన సంఘటనలో కేసు నమోదైనట్లు తెలిపారు. నేరస్తుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మంథని, రామగిరి ఎస్సైలు వెంకటేశ్వర్లు, రవిప్రసాద్, ఏఎస్సై మల్లయ్య, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ నాయక్, కానిస్టేబుళ్లు సురేందర్, కిరణ్, సురేశ్‌ను అభినందించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న మంథని సీఐ

క్లుప్తంగా

సీనియర్ స్టాఫ్ నర్సులకు సన్మానం



స్టాఫ్ నర్సులను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, సీనియర్ స్టాఫ్ నర్సులు వినోద, విజయాచారిలను శాలువాలతో సన్మానించారు. కరోనా సమయంలో నర్సులు అందించిన సేవలు మర్చిపోలేనివన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డీవైసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్, వైద్యులు అంబిక, కాళేశ్వర్, సుమన్, విక్రమ్, మాట్రన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కేంద్రీయ విద్యార్థుల విజయకేతనం



రమాతులసి అశ్రిత్ సాయి ఛాయా చౌహాన్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సీబీఎస్‌ఈ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. 10వ తరగతిలో మొత్తం 67 మందికి గాను అందరూ, 12వ తరగతిలో 46 మందికి గాను అందరూ పాసయ్యారు. పదో తరగతి ఫలితాల్లో రమాతులసి 477, అశ్రిత్ సాయి 472, అయేషా 462, మయూర్ యాదవ్ 461, శ్రేయాన్ 460, సంహిత 459, మోక్షిత 451, 12వ తరగతిలో ఛాయా చౌహాన్ 478, చరణ్ యాదవ్ 455, మౌసమి 452, అమూల్య 451, శ్రావ్య 449, సృష్టి 445, ముస్కాన్ 441 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శరవణ్‌కుమార్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

మనస్తాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



మాధవి (ఫైల్)

రామగుండం: ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మద్దిర్యాలలో విషాదం నింపింది. మద్దిర్యాల గ్రామానికి చెందిన మల్కా సుధాకర్ కూతురు మాధవి(18) ఇంటర్ సెకండియర్‌లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయింది. ఫలితాలు వెలువడిన రోజు మనస్తాపంతో ఇంట్లో పురుగుల మందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు హుటాహుటిన కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. ఈమేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి సుధాకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

కంపు కొడుతోంది!



- రోడ్డుపైకి వస్తున్న ఈ మురికినీరు శాంతినగర్ రైల్వేట్రాక్ సమీపంలోనిది. ఇక్కడ పక్కా డ్రెయినేజీ లేకపోవడంతో మురికి నీరంతా ఇలా రోడ్డుపైకి వచ్చి చేరుతుంది. దోమలు పెరిగి స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు.



పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని చీకురాయిరోడ్డులోని సేయింటాన్స్ స్కూల్ వద్ద ఖాళీ ప్లాట్‌లో నిలుస్తున్న మురికినీరు. సమీప ఇండస్ట్రియల్ నుంచి వస్తున్న వ్యర్థాలతోపాటు స్థానిక గృహాల నుంచి వస్తున్న వృథా నీరు ఈ ఖాళీ ప్లాట్‌లో చేరుతోంది.



- ఈ దృశ్యం పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని హైవే రోడ్డుకు సమీపంలో ఉన్న శాంతినగర్‌లోనిది. ఈ ఖాళీ ప్లాట్ పక్కనే ఉన్న ప్రైవేట్ వాటర్‌ప్లాంట్ నుంచి వచ్చే వృథానీరు, సమీప ఇళ్లళ్ల నుంచి వచ్చే మురికినీరు ఈ ఖాళీ ప్లాట్‌లో చేరి పెద్ద మురికిగుంతగా మారింది. ఈ ఏరియాలో పక్కా డ్రెయినేజీ లేకపోవడంతో పరిస్థితి ఇలా తయారైంది.

- ముందుకు కదలని మురికినీరు
- డ్రెయినేజీల్లో పేరుకుపోతున్న పూడిక
- అంతర్గత రహదారులు బురదమయం
- కాలనీల్లోనే నిలుస్తున్న వృథా నీరు
- పెరుగుతున్న దోమలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పెద్దపల్లి మున్సిపాలిటీ వివరాలు	
జనాభా :	50,762
మున్సిపాలిటీ విస్తీర్ణం : 36.19 చ.కి.మీ	
కాలనీలు :	36
పక్కా డ్రెయినేజీలు : 68 కిలోమీటర్లు	

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంతర్గత కాలనీల్లో డ్రెయినేజీలు కంపుకొడుతున్నాయి. ఎక్కడికక్కడ పేరుకుపోయిన మురికి నీరు.. ఖాళీ ప్లాట్లలో చేరిన వృథానీటితో పరిసరాలు కంపు కొడుతున్నాయి. శివారు కాలనీల్లో పక్కా డ్రెయినేజీలు లేకపోవడంతో మురికినీరు రోడ్లపైకి వస్తోంది. దోమలు పెరిగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంగా అవతరించిన తర్వాత చీకురాయిరోడ్, రంగంపల్లి, చైతన్యకాలనీ, శివపురి, భూంనగర్, టీచర్స్‌కాలనీ, శాంతినగర్ ఏరియాల్లో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు అనుగుణంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డ్రెయినేజీలు నిర్మించడం లేదు. రోడ్లు మంజూరుకావడం లేదు.

కొత్త కాలనీల్లో డ్రెయినేజీలు కరువు

కొత్తగా ఇళ్లు నిర్మిస్తున్న కాలనీల్లో డ్రెయినేజీలు లేకపోవడంతో మురికినీరు ఖాళీ స్థలాల్లో నిలిచి కంపు కొడుతున్నాయని కాలనీవాసులు అంటున్నారు. పెద్దపల్లి నుంచి చీకురాయి వెళ్లే ప్రధానరోడ్డులో మురికినీరు ఆకుపచ్చరంగులో మారి చెరువును తలపిస్తోంది. సమీపంలోనే పాఠశాల, చర్చి ఉన్నాయి. శాంతినగర్ ప్రాంతంలో ఇళ్ల నడుమ వ్యర్థపు నీరు నిలిచి దుర్గంధం వస్తోంది. దీనిపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

ప్రచారానికే డ్రై డే.. డ్రై డే!

ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలనేది ప్రచారానికే పరిమితమవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు కాలనీల్లోనే నిలుస్తూ.. రోడ్లపైనే ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వర్షాకాలంలో ఈ సమస్య మరీ తీవ్రమవుతుంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పనులు చేపడుతున్నాం



పెద్దపల్లి పట్టణంలోని కాలనీల్లో మురికినీరు నిలువకుండా చర్యలు తీసుకుంటున్నాం. చీకురాయిరోడ్డును విస్తరించడంతోపాటు డ్రెయినేజీలను నిర్మిస్తున్నాం. శాంతినగర్ ప్రాంతంలో కచ్చాకాలువలు తీసి మురుగునీటిని బయటకు పంపిస్తున్నాం. పట్టణంలోని ప్రధాన రోడ్లలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలను చేపట్టాం. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచి మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపుతాం.– శ్రీనివాసరెడ్డి, కమిషనర్ పెద్దపల్లి

కాంట్రాక్టు కార్మికుల వివరాలను డిజిటలైజ్ చేయండి



గోదావరిఖని(రామగుండం): కాంట్రాక్టు కార్మికుల వివరాల డిజిటలైజేషన్‌పై శుక్రవారం ఆర్జీ–1, 2 జీఎం కార్యాలయాల్లో సమీక్ష నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ వారీగా కాంట్రాక్టు కార్మికుల పీఎంఈ, మెడికల్ తదితర వివరాలను కంప్యూటర్‌లో పొందుపరిచే విధానాన్ని వివరించారు. ఒకసారి డిజిటలైజ్ చేస్తే అన్ని వివరాలను ఎప్పుడైనా తెలుసుకునే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఏరియాల వారీగా అధికారులు చొరవ తీసుకొని, కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఏరియాల వారీగా వేర్వేరుగా జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కార్పొరేట్ ఐటీ డీవైజీఎం పి.హరిశంకర్‌రావు, ఆర్జీ–1 అధికారులు అభిలాష్, సారంగపాణి, దుర్గాప్రసాద్, హన్మంతరావు, ఆర్జీ–2 అధికారులు ఎస్.అనిల్ కుమార్, రాధాకృష్ణ, ఓంకారి బాబు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సీఎం కప్ పోటీలు

కోల్‌సిటీ(రామగుండం): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్స్ కప్–2023 ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ బి.సుమన్‌రావు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 15లోపు రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు. 15 నుంచి 36 ఏళ్ల మధ్య గల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఫుట్‌బాల్ పోటీలలో పురుషులు మాత్రమే పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో లేదా ఫోన్ నంబర్లలో 70139 00093లో సంప్రదించాలని కోరారు.

రామగుండం ప్రజల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని భావించిన ఎంతోమంది నిత్యం ఉదయం గ్రౌండ్‌లో వాకింగ్ చేయడం అభినందనీయమన్నారు. మైదానంలో త్వరలో వాకింగ్ ట్రాక్, జిమ్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రౌండ్‌లో బైక్‌లు చోరీకి గురవుతున్నాయని, కెమెరాలు ఏర్పాటు చేయాలన్న వాకర్స్ టీం, క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గోదావరిఖని వన్‌టౌన్ రెండో సీఐ ప్రసాదరావు, కార్పొరేటర్లు దొంత శ్రీనివాస్, కొమ్ము వేణు, బాలరాజ్‌కుమార్, నారాయణదాసు మారుతి, బొడ్డు రవీందర్, జేవీ.రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పరశురాం నగర్‌కు చెందిన బోయిని మల్లేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి, పరామర్శించారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తానన్నారు.

నర్సుల పాత్ర కీలకం

ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలో వైద్యులతోపాటు నర్సులు ముందుండి ప్రజల ప్రాణాలను రక్షించడంలో కీలకపాత్ర పోషించారని ఎమ్మెల్యే చందర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కేక్ కట్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్ సింగ్, నాయకులు దొమ్మేటి వాసు, దేవి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మార్కండేయకాలనీ రెయిన్ బో పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే చందర్ శుక్రవారం అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగినప్పుడే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. పాఠశాల నిర్వాహకులు పీఎస్ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాకు చేరిన మినీ జేసీబీ

- రెండేళ్ల తర్వాత వచ్చిన వాహనం
- విజిలెన్స్ దర్యాప్తుతో ఏజెన్సీలో కదలిక
- అడ్రస్ లేని మరో రెండు వాహనాలు, గార్బేజ్ బిన్స్



బల్దియాకు వచ్చిన కొత్త మినీ జేసీబీ వాహనం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలకసంస్థ కార్యాలయంలో వాహనాల కొనుగోలు, అక్రమాలపై విజిలెన్స్ అధికారుల దర్యాప్తు సాగుతున్న నేపథ్యంలో రెండేళ్ల తర్వాత కొత్త మినీ జేసీబీ వాహనం బల్దియాకు చేరుకుంది. వాహనాలు సరఫరా చేయడానికి టెండరు పొందిన ఓ ఏజెన్సీ ప్రతినిధులు గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో మినీ జేసీబీని తీసుకొచ్చారు. బల్దియా ఆవరణలో ఈ వాహనాన్ని పార్క్ చేసి వెళ్లిపోయారు. 14వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.7కోట్లతో బల్దియాలోని శానిటేషన్ విభాగానికి రెండేళ్ల క్రితం పలు వాహనాల కొనుగోలుకు ఓ ఏజెన్సీకి టెండర్ అప్పగించారు. కొన్ని వాహనాలు సరఫరా చేసిన సదరు ఏజెన్సీ ఐదు వాహనాలతోపాటు 50 గార్బేజ్ బిన్స్‌ను సరఫరా చేయలేదు. వీటికి సుమారు రూ.2.34కోట్ల వరకు బల్దియా చెల్లించింది. కానీ రెండేళ్లయినా వాహనాలను సరఫరా చేయకపోవడంపై అనుమానంతో పలువురు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు మొదలు పెట్టారు. ఖంగుతిన్న ఏజెన్సీ ప్రతినిధులతోపాటు వారికి అండగా నిలిచినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు అప్రమత్తయ్యారు. ట్రక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్ వాహనంతోపాటు జట్టింగ్‌రాడ్ మెషిన్ వాహనాన్ని తెప్పించారు. మరో మూడు వాహనాలు మినీ జేసీబీతోపాటు స్కైలిఫ్టర్, బాబ్‌కార్డ్ మిషన్ వాహనాలు, 50 గార్బేజ్ బిన్స్ అడ్రస్ లేకుండా పోయాయి. వీటిపై వివాదం రోజురోజుకు ముదురుతున్న నేపథ్యంలో గురువారం రాత్రి సుమారు రూ.25లక్షల విలువ గల మినీ జేసీబీని ఏజెన్సీ సంబంధికులు బల్దియాకు తెప్పించడం గమనార్హం. మరో రెండు వాహనాలు, గార్బేజ్ బిన్స్‌ను ఎప్పటిలోగా వస్తాయో వేచి చూడాలి.



అనారోగ్యంతో ప్రభుత్వ కళాశాల లెక్చరర్ మృతి

జూలపల్లి(పెద్దపల్లి): జూలపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ బోయిన రాజమల్లు(52) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. అధ్యాపకుడు రాజమల్లు కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. రెండు రోజుల క్రితం ఆరోగ్యం క్షీణించడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు గత 15 ఏళ్లుగా పార్ట్‌టైం అధ్యాపకునిగా పనిచేస్తుండగా ఇటీవల ప్రభుత్వం పర్మినెంటు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. మృతునికి భార్య పద్మ, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. రాజమల్లు మృతిపై కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

రామగుండం: ఆర్థిక.. అనారోగ్య సమస్యలతో ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుడు శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అంతర్గాం మండలంలోని ముర్మూర్‌కు చెందిన చెరుకుతోట శ్రీనివాస్ ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడు. ఉద్యోగం కోసం దళారులకు అందజేసిన నగదు పూర్తిగా రాలేదనే బెంగతోపాటు ఇటీవల అనారోగ్య సమస్యలు తీవ్రమవడంతో మనస్థాపానికి గురయ్యాడు. గురువారం విధులకు వెళ్లి రాత్రి ఇంటికొచ్చాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గుర్తించి హుటాహుటిన గోదావరిఖని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యం నిలకడగా ఉందని, 24 గంటలు గడిస్తే తప్పా పరిస్థితి చెప్పలేమని వైద్యులు తెలిపారు. ఈ విషయమై అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా ఆత్మహత్యాయత్నానికి సంబంధించి అన్ని కోణాల్లో పూర్తి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

శుభకార్యాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత ప్రజలకు వివాహాది శుభకార్యాలకు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు స్థానిక డిపో మేనేజర్ పి.మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల బస్సులను 10 శాతం రాయితీతో ఇస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లతో కండీషన్ ఉన్న రాజధాని, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులను 200 కిలోమీటర్లలోపు మాత్రమే ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99592 25922, 73828 47316, 63000 76072 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులో స్వయంభుగా వెలసిన శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం ధ్వజస్తంభ ఆరోహణ, యంత్రప్రతిష్ఠ కార్యక్రమాలను పుష్పగిరి పీఠాధిపతి విభూషిత విద్యాశంకర భారతీస్వామి నిర్వహించారు. శివకల్యాణం జరిపించారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో 'అల్ఫోర్స్' విజయఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): స్థానిక అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు శుక్రవారం ప్రకటించిన సీబీఎస్‌ఈ ఫలితాల్లో విజయఢంకా మోగించారని విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో 500 మార్కులకు గాను జె.వావిక 495, ఎస్.అనిరుధ్ సాయి 492, బి.శ్రీహిత 487, ఎ.శివాశ్రిత 487, మరో 73 మంది విద్యార్థులు 450కి పైగా మార్కులు సాధించారన్నారు. 12వ తరగతిలో 500 మార్కులకు గాను పి.వేదవిష్ణు 486, డి.అశ్వితరెడ్డి 484, షికారి చందన 478, ఆర్.సుహాసిత 473, నిషాంత్‌పోర్వల్ 471, మరో 30కి పైగా 400కు పైన మార్కులు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను చైర్మన్‌తోపాటు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

'పారమిత' ప్రభంజనం



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు

కొత్తపల్లి(కరీంనగర్): సీబీఎస్‌ఈ ఫలితాల్లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 500 మార్కులకు గాను శ్రీనిజా రెడ్డి 495(99 శాతం) మార్కులు సాధించింది. 60 మంది 90 శాతం, ఆపైన, 46 శాతం మంది విద్యార్థులు 80 శాతం ఆపైన, 72 శాతం మంది విద్యార్థులు 70 శాతం ఆ పైన మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య తెలిపారు. 12వ తరగతిలో పీసీఎం విభాగంలో తేజేశ్వర్ 500లకు గాను 478 మార్కులు, వన్షిత 91.2 శాతం, హర్షవర్ధన్ 90.6 శాతం, పీసీబీ విభాగంలో స్ఫూర్తి 93.6 శాతం, పల్లవి 92.6 శాతం, బీఈఏ విభాగంలో మధుమోహన్ 90.80 శాతం మార్కులు తెచ్చుకున్నారని చెప్పారు. విద్యార్థులను పారమిత విద్యాసంస్థల అధినేత ఇ.ప్రసాదరావుతోపాటు డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, రాకేశ్ ప్రసాద్, రశ్మిత, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హన్మంతరావు, పినాకిల్ హెడ్ గోపీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

'సెయింట్ జార్జ్' సత్తా



విజయసంకేతం చూపుతున్న చైర్మన్ ఫాతిమారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): సీబీఎస్‌ఈ ఫలితాల్లో కొత్తపల్లి సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని విద్యాసంస్థల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. 10, 12వ తరగతుల్లో వందశాతం ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. 10వ తరగతిలో 500 మార్కులకు గాను విజయ్ శ్రీకర్ 472, అక్షయ్ వంశీప్రసాద్ 440, మనుచరణ్ 411 మార్కులు సాధించారన్నారు. 12వ తరగతిలో 12 మందికి గాను అందరూ పాసైనట్లు తెలిపారు. రోమీస సైన్స్ స్ట్రీమ్‌లో 437 మార్కులు వచ్చాయన్నారు. విద్యార్థులను ఆయనతోపాటు ప్రిన్సిపాల్ వి.నిరంజన్, అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, లెక్చరర్లు అభినందించారు.

'పది' ఫలితాల్లో 'భగవతి, అర్విన్‌ట్రీ' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాలల యాజమాన్యం

కరీంనగర్: పదోతరగతి ఫలితాల్లో భగవతి, అర్విన్‌ట్రీ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని చైర్మన్ బి.రమణారావు తెలిపారు. మొత్తం 72 మందికి గాను 63 మంది ఏ గ్రేడ్ సాధించారన్నారు. 10 జీపీఏ సాధించిన ఇ.వైశాలి, జి.సారిక, కె.శశ్విత, పి.మానస, జి.నితీష, వి.కృషాల్, 9.8 జీపీఏ తెచ్చుకున్న టి.విద్వాన్, సి.రేవన్ రెడ్డి, జి.శ్రీవర్షిత, కె.రిష్వన్‌లను ఆయనతోపాటు డైరెక్టర్ బి.విజయలక్ష్మి, టీచర్లు అభినందించారు.

సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్లను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ట, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్‌సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకుచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌చైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? అల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..



అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. –భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సయ్యద్ డానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యుల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.



నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా

నగర మాడ్యుల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

ఈ కేసులో సాక్షులుగా 'వారు'

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్–2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది, ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాదిరాన సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

నిర్వహించనున్న క్రీడలు.. : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

నగదు ప్రోత్సాహకాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ–రూ.20 వేలు, ద్వితీయ–రూ.15 వేలు, తృతీయ–రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొండికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టచెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

అజ్ఞాతానికి తెర

- 2004లో మావోయిస్టు దళంలోకి జ్యోతక్క
- కరీంనగర్ పోలీసు కమిషనర్ ఎదుట లొంగుబాటు

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్క లొంగిపోవడంతో 20 సంవత్సరాల అజ్ఞాతానికి తెర పడినట్లయింది.

మావోయిస్ట్ జ్యోతి నేపథ్యం..

కోనరావుపేట మండలం శివంగాలపల్లికి చెందిన నేరెళ్ల నర్సయ్య– భూదవ్వకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. చిన్న కూతురు జ్యోతి ఐదో తరగతి వరకు స్థానిక పాఠశాలలో, 6–10 వరకు కోనరావుపేట ఉన్నత పాఠశాలలో, ఇంటర్ సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలో చదివింది. 2004లో శివంగాలపల్లిలో అప్పటి దళ కమాండర్ పద్మక్క గ్రామంలో సమావేశం నిర్వహించగా, ఆమె మాటలు విని జ్యోతి ఉద్యమం పట్ల ఆకర్షితురాలైంది. కళాశాలలో చదువుతుండగానే సీవో రఘు ఆధ్వర్యంలో మావోయిస్టుల్లో చేరి అజ్ఞాతంలోకి వెళ్లింది.

20 ఏళ్లలో వివిధ హోదాలు

మావోయిస్టులో చేరిన జ్యోతక్క మొదట మదిమల్ల ఎల్‌జీఎస్ దళ సభ్యురాలిగా ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, చందుర్తి, కథలాపూర్, నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీంగల్ ప్రాంతాల్లో పనిచేసింది.



శివంగాలపల్లి గ్రామం

2011లో కర్రిగుట్ట(ఆదిలాబాద్ జిల్లా)లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత ఒడిశా రాష్ట్రానికి వెళ్లింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రెస్ ఇన్‌చార్జిగా పనిచేస్తోంది. పార్టీలో ఉండగానే దినేశ్ అలియాస్ ఎర్రగొల్ల రవిని పెళ్లి చేసుకుంది. అతడి వేధింపులు భరించలేక విడిపోయి ఇన్నాళ్లు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో పనిచేసింది.

ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా అలజడే..

ఏ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ జరిగినా శివంగాలపల్లిలో అలజడి నెలకొనేది. మృతి చెందింది మహిళా నక్సలైట్ అయితే చాలు తమ జ్యోతే కావొచ్చని తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. పోలీసులు పలుమార్లు కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి జ్యోతి లొంగిపోవాలని కోరారు. తండ్రి నర్సయ్య, సోదరుడు మల్లయ్య మృతి చెందగా మరో సోదరుడు ఆటో నడుపుకుంటూ సాధారణ జీవితం గడుపుతున్నాడు. ఎప్పటికైనా తమ కూతురు రాకపోతుందా అని ఎదురుచూస్తున్న వారి కోరిక ఇన్నాళ్లకు నెరవేరడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ఇంజినీరింగ్ ఎంసెట్

తిమ్మాపూర్: ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఎంసెట్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం పకడ్బందీగా పరీక్షను నిర్వహిస్తోంది. ఈ నెల 12వ తేదీనాటి పరీక్ష ఉమ్మడి జిల్లాలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో 2 కేంద్రాలు, కరీంనగర్‌లోని వివేకానంద, అల్ఫోర్స్, హుజూరాబాద్‌లోని కిట్స్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. గంటన్నర ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు. విద్యార్థుల హాల్ టికెట్ బార్ కోడింగ్ ద్వారా పరీక్షించి కేంద్రంలోకి అనమతిచ్చారు. జ్యోతిష్మతిలో 80 మంది విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం 78మంది హాజరయ్యారు. వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్లో 722 మంది విద్యార్థులకు ఉదయం 696మంది, మధ్యాహ్నం 701మంది హాజరయ్యారు. వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో 110మంది విద్యార్థులకు ఉదయం 107 మంది, మధ్యాహ్నం 108మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య 1 కళాశాలలో ఉదయం 80మందికి 79మంది హాజరుకాగా, మధ్యాహ్నం 80మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య–2లో ఉదయం 200 మంది విద్యార్థులకు 196మంది, మధ్యాహ్నం 195మందికి హాజరయ్యారు. అల్ఫోర్స్‌లో 55మందికి ఉదయం 52మంది, మధ్యాహ్నం 55మంది హాజరయ్యారు. హుజూరాబాద్ కిట్స్ కళాశాలలో ఉదయం 90మందికి 88మంది హాజరుకాగా, మధ్యాహ్నం 86మంది హాజరయ్యారు. వివేకానందలో 105మందికి ఉదయం 104మంది, మధ్యాహ్నం 103 హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ ప్రమోద్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు..

- మళ్లీ విధుల్లో చేరారు..
- ఇది ఉపాధ్యాయుల తీరు

జగిత్యాల: జిల్లాలో గత మార్చి 15 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. సారంగాపూర్ మండలంలోని పది మంది ఉపాధ్యాయులకు ఈ పరీక్షలకు ఇన్విజిలేషన్ విధులు అప్పగించారు. వారు మార్చి 14న మధ్యాహ్నం 2 గంటల వరకు రిలీవ్ అయి తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో రిపోర్టు చేశారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా కొందరు ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రాల్లో పర్యవేక్షణకు వెళ్లలేదు. అటు పాఠశాలలకు వెళ్లకుండా, ఇటు పరీక్ష కేంద్రాలకు హాజరు కాకుండానే 15 రోజులు ఎక్కడో గడిపారు. అయితే, మళ్లీ పాఠశాలలో చేరేందుకు హెడ్‌మాస్టర్లు అయితే, ఎంఈవో, ఉపాధ్యాయులైతే హెడ్‌మాస్టర్‌కు రిపోర్టు చేయాలి. ఇందుకోసం తాము ఇంటర్ పరీక్షలకు పర్యవేక్షకులు విధులు నిర్వర్తించినట్లు డ్యూటీ సర్టిఫికెట్లు సమర్పించాలి. కానీ, ఎంఈతోపాటు హెడమాస్టర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విధుల్లో చేరినట్లు తెలిసింది. సుమారు 15రోజుల పాటు ఇన్విజిలేషన్‌కు వెళ్లకుండా, అంటు పాఠశాలలకు హాజరు కాకుండా నిబంధనలు అతిక్రమించిన డుమ్మా టీచర్లు, హెడ్‌మాస్టర్లు వేతనం పొందినట్లు తెలిసింది. ఒకరిద్దరు గైర్హాజరు కావడం, మరికొందరు అసలు పర్యవేక్షణ విధులకే వెళ్లకుండా మళ్లీ స్కూళ్లలో చేరి, వేతనం పొందినట్లు ప్రచారం జరుగుతోంది.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు

ఇంటర్మీడియెట్ పర్యవేక్షకులుగా వెళ్లిన కొద్దిమంది ఉపాధ్యాయులు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు. ఈనెల 15లోపు అందజేస్తామని వారు తెలిపారు. ఒకవేళ వారు ఇన్విజిలేషన్ విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటాం.

– భీమయ్య, ఎంఈవో, సారంగాపూర్

రాజన్న సేవలో ఏడీసీ



దర్శనానికి వెళ్తున్న ట్రిబ్యునల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం రాష్ట్ర దేవాదాయశాఖ ట్రిబ్యునల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆయన వెంట పర్యవేక్షకులు శ్రీరాములు, అల్లి శంకర్, ఏఈ డి.శేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'మన బడి' భద్రతకు వాచ్‌మెన్



మన బస్తీ–మనబడిలో ఎంపికైన మంచిర్యాల న్యూ గర్ల్మిల్ల పాఠశాల

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లో పాఠశాలల రక్షణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దశలవారీగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, సమగ్ర అభివృద్ధి, పటిష్టత కోసం గ్రామీణ ప్రాంతాల్లో మన ఊరు–మన బడి, పట్టణ ప్రాంతాల్లో మన బస్తీ–మన బడి కార్యక్రమం కింద పనులు చేపట్టింది. ఇప్పటికే కొన్ని పాఠశాలలు అన్ని హంగులతో తీర్చిదిద్దారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సిస్టం, తాగునీరు, సోలార్ పీవీ సిస్టమ్స్, భోజనశాల ఫర్నిచర్, ఐఎఫ్‌పీఎస్, డ్యూయల్ డెస్కులు, పాఠశాలలకు పెయింటింగ్, గ్రీన్‌చాక్ బోర్డులు వంటి సౌకర్యాలు సమకూర్చారు. పనులు పూర్తి చేసిన ప్రతీ పాఠశాలలో పగలు, రాత్రి కాపలాదారుని నియమించాలని పాఠశాల విద్య డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే వరకు తాత్కాలిక పద్ధతిన వాచ్‌మెన్‌ల నియామకం చేపట్టాలని సూచించారు.

నియామకం.. విధులు ఇలా..

పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా డే, నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వాచ్‌మెన్‌ను నియమించే సమయంలో గత పనితీరు, పూర్వాపరాల ఆధారంగా కాపలాదారున్ని తాత్కాలిక పద్ధతిన విధుల్లోకి తీసుకోవాలి. స్థానికుడై ఉండడంతోపాటు 60 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలనే నిబంధనలున్నాయి. నెలకు రూ.5వేలు గౌరవ వేతనాన్ని ఎంవోఎంబీ, ఎంబీఎంబీ అడ్మిస్ట్రేటివ్ ఖర్చు నుంచి చెల్లిస్తారు.

జిల్లాల వారీగా..

జిల్లా	పాఠశాల సంఖ్య
ఆదిలాబాద్	32
కుమురంభీం	65
నిర్మల్	88
మంచిర్యాల	85

బాధ్యతలు..

కాపలాదారు పగలు, రాత్రి పాఠశాలల భద్రత చేపట్టాల్సి ఉంటుంది. ఏఎఫ్‌పీల ఇన్‌స్టాలేషన్, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, డ్యూయల్ డెస్కులు, డ్రికింగ్, సోలార్ ప్యానల్‌లతోపాటు మొక్కలకు నీరు పెట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణలో క్రమం తప్పకుండా చూడడం, వార్డు విధులు, అనధికార వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించకుండా చూడాల్సి ఉంటుంది. తాత్కాలిక పద్ధతిన నియమించే వాచ్‌మెన్‌కు గౌరవ వేతనాన్ని విడుదల చేసేందుకు నెలవారీ హాజరు అందించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

బొమ్మలకు శుభమంగళం

- చిన్నారులే పెండ్లి పెద్దలుగా..
- కుమురంభీం జిల్లా తాటిపల్లిలో అట్టహాసంగా బొమ్మల పెళ్లి



తాటిపల్లిలో బొమ్మల పెళ్లి జరిపిస్తున్న చిన్నారులు

కౌటాల(సిర్పూర్): పెళ్లికూతురు అందంగా ముస్తాబైంది. పెళ్లి కుమారుడు మండపంలో కూర్చొని సిద్ధంగా ఉన్నాడు. చిన్నపిల్లలు తోడుగా రాగా.. వధువు సిగ్గుపడుతూ మండపానికి విచ్చేసింది. చిన్నారులే పెండ్లి పెద్దలుగా వ్యవహరించి వేదమంత్రాలతో కల్యాణం జరిపించారు. వధువు, వరుడు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కుమురంభీం జిల్లా కౌటాల మండలం తాటిపల్లిలో గురువారం రాత్రి నిర్వహించిన బొమ్మల పెళ్లిలో కనిపించిన చూడముచ్చటైన దృశ్యమిది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ప్రజలు మరాఠా సంప్రదాయాలు పాటిస్తారు. ఏటా సంప్రదాయాలు, వివాహ బంధం, కుటుంబ విలువలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు బొమ్మల పెళ్లిళ్లు నిర్వహిస్తారు. వేసవిలో విద్యాసంస్థలకు సెలవులు రావడం, మంచి ముహూర్తాలు ఉండడంతో తాటిపల్లిలోని హనుమాన్ ఆలయంలో గ్రామానికి చెందిన చిన్నారులు వధువు, వరుడు బొమ్మలను అందంగా అలంకరించి వివాహం జరిపించారు. సంప్రదాయం ప్రకారం గణపతి గజముఖం, మంగళాష్టకాలులను చదువుతూ.. శుభ మంగళ సావధాన్ మంత్రం పఠిస్తూ పెళ్లి తంతు పూర్తి చేశారు. ఈ వేడుక నిర్వహణకు చిన్నారులే నగదు జమ చేసుకుని ఖర్చు భరించడం విశేషం. వివాహం అనంతరం విందు సైతం ఏర్పాటు చేశారు.



నిర్మానుష్యంగా మారిన గ్రామం

నిర్మానుష్యంగా.. సుంకిడి



పోలీసుల బందోబస్తు

తలమడుగు: నిత్యం స్థానికులతో రద్దీగా ఉండే సుంకిడి గ్రామం శుక్రవారం నిర్మానుష్యంగా మారింది. గ్రామస్తులంతా ఐదేళ్లకోసారి చాందా గ్రామంలోని శ్రీ మహాలక్ష్మిదేవి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే వీరంతా అక్కడికి వెళ్లారు. పూజల అనంతరం అక్కడే వండుకొని భోజనా లు చేశారు. రాత్రి ఇళ్లకు చేరుకున్నారు. కాగా, ఊరంతా ఖాళీ కావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ఎ మ్మెల్యే రాథోడ్ బాపూరావు, మాజీ ఎంపీ నగేశ్ స ర్పంచ్, మహేందర్ తదితరులు వెళ్లారు.